నమస్తే తెలంగాణ
వికారాబాద్
I | హైదరాబాద్, బుధవారం 29 మే 2024 | VIKARABAD

కౌంటింగ్‌ను సజావుగా చేపట్టాలి

శిక్షణా తరగతుల్లో రిటర్నింగ్ అధికారి, రంగారెడ్డి కలెక్టర్ శశాంక

కౌంటింగ్ సిబ్బందికి సూచనలిస్తున్న రంగారెడ్డి కలెక్టర్ శశాంక

రంగారెడ్డి, మే 28 (నమస్తే తెలంగాణ): నిబంధనలు పక్కాగా పాటిస్తూ.. ఓట్ల లెక్కింపు ప్రక్రియను సజావుగా నిర్వహించాలని చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, రంగారెడ్డి కలెక్టర్ శశాంక సూచించారు. చేవెళ్ల మండలం గొల్లపల్లి గ్రామంలోని బండారి శ్రీనివాస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో జూన్ 4న చేపట్టనున్న చేవెళ్ల లోక్‌సభ ఓట్ల లెక్కింపును పురస్కరించుకుని కౌంటింగ్ సూపర్‌వైజర్లు, సహాయకులు, మైక్రోఅబ్జర్వర్లకు మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శిక్షణా తరగతులు నిర్వహించారు. కౌంటింగ్ నిర్వహణ సందర్భంగా పాటించాల్సిన నిబంధనలు, అనుసరించాల్సిన పద్ధతులను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈవీఎంల ఓట్ల లెక్కింపు ఎలా చేయాలి? పోస్టల్ బ్యాలెట్ ఓట్లను ఎలా లెక్కించాలి..? అనే అంశాలపై సంబంధిత అధికారులు, సిబ్బందికి వేర్వేరుగా శిక్షణఇచ్చారు. పలువురు కౌంటింగ్ సిబ్బంది వ్యక్తపరిచిన సందేహాలను మాస్టర్ ట్రైనర్లు నివృత్తిచేశారు. ఈ సందర్భంగా రంగారెడ్డి కలెక్టర్ శశాంక మాట్లాడుతూ.. చేవెళ్ల లోక్‌సభ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఓట్ల లెక్కింపు పక్కాగా జరిగేలా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఉదయం 6 గంటలకు కౌంటింగ్ సిబ్బంది ఓట్ల లెక్కింపు కేంద్రానికి చేరుకోవాలని, ర్యాండమైజేషన్ ప్రక్రియ అనంతరం వారికి ఆయా సెగ్మెంట్ల వారీగా టేబుళ్లను కేటాయించడం జరుగుతుందన్నారు. ఓట్ల లెక్కింపు కోసం మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించి 28 టేబుళ్లు, మిగతా నాలుగు అసెంబ్లీ సెగ్మెంట్లయిన చేవెళ్ల, పరిగి, వికారాబాద్, తాండూరులకు సంబంధించి 14 చొప్పున టేబుళ్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపును త్వరగా పూర్తి చేయాలని.. ఎక్కడా పొరపాట్లకు ఆస్కారం ఇవ్వొద్దన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు తిరస్కరణకు గురైతే అందుకు గల కారణాలను అభ్యర్థులు, వారి ఏజెంట్లకు స్పష్టంగా తెలపాలన్నారు. ఈవీఎంల ఓట్లను రౌండ్ల వారీగా జాగ్రత్తగా లెక్కిస్తూ, ప్రతి రౌండ్‌కూ ఏజెంట్ల సంతకాలు తీసుకోవాలన్నారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా సమస్యలొస్తే సహాయ రిటర్నింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. కౌంటింగ్ సెంటర్‌లో అన్ని వసతులు అందుబాటులో ఉంటాయని.. సెల్‌ఫోన్లకు అనుమతి లేదన్నారు. శిక్షణా తరగతుల్లో డీఆర్వో సంగీత, సహాయ రిటర్నింగ్ అధికారులు, కౌంటింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి

చిన్న పొరపాటూ జరగొద్దు

వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, మే 28 : చేవెళ్ల లోక్‌సభ కౌంటింగ్ ప్రక్రియలో చిన్న పొరపాటు కూడా జరగొద్దని జిల్లా ఎన్నికల అధికారి, వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు కౌంటింగ్ రోజున చేపట్టే విధివిధానాలపై నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులతో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. ఓట్ల లెక్కింపు రోజున చిన్న పొరపాటూ జరుగకుండా మైక్రో అబ్జర్వర్లు కౌంటింగ్ సూపర్‌వైజర్ల విధులు నిర్వహించాలన్నారు. అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారుల ఆధ్వర్యంలో కౌంటింగ్ ప్రక్రియ బృందాల వారీగా చేపట్టాల్సి ఉంటుందని.. ఆర్వోల వద్ద ఆర్డర్ కాపీలు, ఐడీ కార్డులను తీసుకోవాలన్నారు. కౌంటింగ్ రోజున ఉదయం 8గంటలకు పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కించాలని..8:30 గంటలకు ఈవీఎంల లెక్కింపును ప్రారంభించాలన్నారు.

కౌంటింగ్ సూపర్‌వైజర్లు కంట్రోల్ యూనిట్ ఆయా పోలింగ్ స్టేషన్లకు సంబంధించినదా..? కాదా..? అని చెక్ చేసుకోవాలని సూచించారు. కౌంటింగ్ ఏజెంట్ల సమక్షంలో కంట్రోల్ యూనిట్‌లో నమోదైన మొత్తం ఓట్లు, ఫారం17సిలో నమోదైన ఓట్లు సరిచూసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ , ఆర్డీవోలు వాసుచంద్ర, శ్రీనివాస్, మాస్టర్ ట్రైనర్లు రాంరెడ్డి , వీరాకాంతం, సంబంధిత ఎన్నికల విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

ఇండస్ట్రియల్ పార్కు పనులు షురూ..

తాండూరు రూరల్, మే 28 : తాండూరు మండలంలోని జినుగుర్తి సమీపంలో నూతనంగా నిర్మించబోయే ఇండస్ట్రియల్ పార్కు పనులు ప్రారంభమయ్యాయి. 336 ఎకరాల్లో ఈ పార్కును నిర్మించాలని గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్ణయించి భూమిని కూడా సేకరించింది. రోడ్డు పనులు ప్రారంభం కాగా, ఇప్పటికే రైతుల ఖాతాల్లో నష్ట పరిహారం జమైనది. ఆ పార్కు నిర్మాణం పూర్తయితే తాండూరు చుట్టూ ఉండే పాలిషింగ్ యూనిట్లు ఒక దగ్గరకు వస్తాయి. దీంతో వాయుకాలుష్యం, దుమ్ము, ధూళి లేకుండా ఉండే అవకాశాలు ఉంటాయి.

ఉద్యానం వెలవెల..

వెజిటబుల్ హబ్‌గా పేరున్న రంగారెడ్డి జిల్లాలో కళ తప్పిన ఉద్యాన పంటల సాగు

పండ్లు, కూరగాయల సాగుపై రైతుల అనాసక్తి

వరి, పత్తి వంటి వాణిజ్య పంటల వైపు మొగ్గు

ప్రస్తుత వానకాలంలో 15,461 ఎకరాలకే ఉద్యాన సాగు ప్రణాళిక

దిగుబడి లేక మార్కెట్‌లో ఆకాశాన్నంటుతున్న కూరగాయలు, పండ్ల ధరలు

రంగారెడ్డి, మే 28 (నమస్తే తెలంగాణ) : ఒకప్పుడు 'వెజిటబుల్ హబ్'గా ఉన్న రంగారెడ్డి జిల్లాలో నేడు ఉద్యాన సాగు వెలవెలబోతున్నది. పండ్లు, కూరగాయల తోటల సాగుపై రైతులకు ఆసక్తి తగ్గి.. వరి, పత్తి వంటి వాణిజ్య పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. ఉద్యాన పంటలు పండించాలంటే కూలీల కొరత, నీటి లభ్యత గురించి ఆలోచించాల్సి వస్తుండడంతో అన్నదాతలు వెనుకడుగు వేస్తున్నారు. ఉద్యాన పంటల సాగు పెంపునకు అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా ఆశించిన ఫలితం రావడం లేదు.

కూరగాయల సాగుకు కేరాఫ్‌గా..

ఒకప్పుడు జిల్లాలోని అనేక పల్లెలు కూరగాయల సాగుకు కేరాఫ్‌గా నిలిచాయి. కొన్ని దశాబ్దాలుగా రైతు కుటుంబాలు కూరగాయల సాగునే జీవనాధారంగా చేసుకుని బతుకుతున్నాయి. చేవెళ్ల, మొయినాబాద్, షాబాద్ తదితర ప్రాంతాలు క్యారెట్ సాగుకు పేరుగాంచగా.. ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్‌మెట్, బాలాపూర్ ప్రాంతాలు ఆకుకూరలకు, షాద్‌నగర్ పచ్చిమిర్చి సాగుకు పేరొందాయి. ఉల్లిగడ్డ, ఆలుగడ్డల సాగుకు ఇక్కడి భూములు యోగ్యంగా లేకపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తున్నది. వివిధ రకాల కూరగాయలతో పాటు పాలకూర, చుక్కకూర, పొనగంటి కూర, మెంతికూర, ఎర్రగోంగూర వంటి అనేక రకరకాల ఆకు కూరలు, కూరగాయలను పండిస్తూ జిల్లా రైతాంగం ఆర్థిక ప్రగతిని సాధిస్తూ వచ్చిం ది. జిల్లా అవసరాలకు పోగా.. మిగిలిన కూరగాయలు హైదరాబాద్ మహానగరంతోపాటు చుట్టూ ఉన్న ప్రాంతాలకు ఎగుమతి అయ్యేవి. ప్రస్తుతం ఉద్యాన సాగు తగ్గడంతో చాలావరకు కూరగాయలను జిల్లాకు దిగుమతి చేసుకునే పరిస్థితి వచ్చింది.

రాయితీలు కల్పిస్తున్నా..

పాలీహౌజ్, నెట్‌హౌజ్‌లలో కూరగాయలను సాగు చేసేందుకు ఉద్యాన శాఖ రాయితీలు కల్పిస్తున్నది. జీడిమెట్ల, ములుగు ప్రాంతాల్లోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రాల ద్వారా రైతులకు అవగాహన, శిక్షణా కార్యక్రమాలను సైతం నిర్వహిస్తున్నది. నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేయడంలో సహకరించడంతోపాటు సబ్సిడీపై కూరగాయల మొక్కలను సైతం అందిస్తున్నది. ఆయిల్‌పామ్ తోటల్లో అంతర పంటగా కూరగాయల సాగును చేపట్టేందుకు స్ప్రింక్లర్లను సైతం రాయితీపై ఇస్తున్నది. ఎస్సీ, ఎస్టీ రైతులకు 100శాతం, బీసీలకు 90శాతం, ఇతర రైతులకు 80 శాతం చొప్పున రాయితీ కల్పిస్తున్నా ఉద్యాన పంటల సాగుకు రైతులు ముందుకు రావడం లేదు.

క్రమక్రమంగా తగ్గుముఖం..

ఒకప్పుడు ఉద్యాన పంటల సాగులో జిల్లాకు ప్రత్యేక స్థానముండగా..కూరగాయల సాగులో రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిచింది. ప్రతి ఏటా 72 వేల ఎకరాల్లో పండ్లు, కూరగాయలు సాగై దాదాపు మూడు లక్షల మెట్రిక్ టన్నులకు పైగా కూరగాయలను రైతులు పండించేవారు. అయితే హైదరాబాద్‌కు చెంతనే ఉన్న రంగారెడ్డి జిల్లా గత పదేండ్ల కాలంలో నలువైపులా శరవేగంగా విస్తరిస్తుండడం కూరగాయల సాగుపై ప్రభావం పడింది. పెద్ద ఎత్తున పరిశ్రమలు, కంపెనీలు ఏర్పాటవుతుండడం.. వ్యవసాయ భూములు రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మారిపోతుండడంతో కూరగాయల సాగు క్రమక్రమంగా తగ్గుతూ వస్తున్నది. దీనికితోడు వర్షాభావ పరిస్థితులు సైతం నెలకొనడంతో రైతులు కూరగాయలను పండించే సాహసం చేయలేకపోతున్నారు. 2021-22 సంవత్సరం వానకాలంలో 62,598 ఎకరాల్లో పండ్లు, కూరగాయలను జిల్లా రైతులు సాగు చేయగా.. 2022-23లో 64,397 ఎకరాల్లో, 2023-24లో 60,714 ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగయ్యాయి. ప్రస్తుత వానకాలంలో కేవలం 15,461 ఎకరాల్లోనే ఉద్యాన పంటలు సాగయ్యే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఏటేటా ఉద్యాన పంటలను సాగు చేసే రైతుల సంఖ్య తగ్గుతూ వస్తుండగా.. వరి, పత్తి వంటి పంటల సాగు వైపు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు.

ఆందోళన కలిగిస్తున్న ధరలు ..

జిల్లాలో మెజార్టీ పంటలు బోర్లు, బావుల కిందే సాగవుతున్నాయి. భూగర్భ జలాలు రోజురోజుకూ పడిపోతుండడంతో నీటి వనరుల్లో నీటిమట్టాలు అడుగంటుతున్నాయి. దీంతో కూరగాయల సాగు తగ్గి దిగుబడులపై ప్రభావం చూపుతున్నది. దీంతో కూరగాయలు, పండ్ల ధరలు మార్కెట్లో అమాంతంగా పెరిగిపోతున్నాయి. పేద, మధ్యతరగతి ప్రజలు పండ్లు, కూరగాయలను కొనేందుకు ఇబ్బందిపడుతున్నారు. మార్కెట్‌కు రూ.200 నుంచి రూ.300 వరకు తీసుకెళ్తే గతంలో సంచి నిండా కూరగాయలు వచ్చేవి. ప్రస్తుతం పరిస్థితి తలకిందులైంది. ధరలు భగ్గుమంటుండడంతో కిలో చొప్పున కూరగాయలు కొనుగోలు చేసేవారు ప్రస్తుతం అర కిలో, పావు కిలో కొంటున్నారు. పేద, మధ్యతరగతి ప్రజలైతే ఆకుకూర..లేదంటే పప్పు వంటకాలతో సరిపుచ్చుకుంటున్నారు. పరిస్థితులు ఇలాగే కొనసాగితే.. రానున్న రోజుల్లో పండ్లు, కూరగాయలను కొనలేని పరిస్థితులు నెలకొననున్నాయి.

అంగన్‌వాడీ టీచర్ల.. ఇంటింటి సర్వే

కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేస్తున్న అంగన్‌వాడీ టీచర్

పౌష్టికాహారం పారదర్శకంగా లబ్ధిదారులకు అందేలా చర్యలు

కుటుంబ సభ్యుల వివరాలు యాప్‌లో ఎంట్రీ

బొంరాస్‌పేట, మే 28 : అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం పక్కదారి పట్టకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. పౌష్టికాహారం నేరుగా లబ్ధిదారులకు అందేలా ప్రత్యేక సర్వే చేపడుతున్నది. దీనిద్వారా లబ్ధిదారులకు పాలు, గుడ్లు, బాలామృతం వంటివి అందడంతోపాటు తీవ్ర పోషకాహార లోపం ఉన్న చిన్నారులను గుర్తించి ప్రతినెలా బరువు, ఎత్తు వంటివి గమనించనున్నారు. ఇందుకోసం మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో న్యూట్రిషన్ హెల్త్ ట్రాకింగ్ సిస్టం(ఎన్‌హెచ్‌టీఎస్) పేరుతో సర్వేకు శ్రీకారం చుట్టింది. ఈ సర్వే మార్చిలో ప్రారంభం కాగా అంగన్‌వాడీ టీచర్లు ఎన్నికల్లో బీఎల్‌వోలుగా విధులు నిర్వహించిన కారణంగా మధ్యలో నిలిచిపోయింది. ఎన్నికలు పూర్తి కావడంతో మళ్లీ సర్వేను కొనసాగిస్తున్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఇవ్వాల్సిన పాలు, గుడ్లు, బాలామృతం వంటి పౌష్టికాహారం పక్కదారి పట్టకుండా ఈ సర్వే ఉపయోగపడుతుంది. లబ్ధిదారులు రెండుచోట్ల పౌష్టికాహారం తీసుకోకుండా సర్వేతో అడ్డుకట్ట వేయడంతోపాటు అంగన్‌వాడీ టీచర్లు ఎక్కువ మంది పేర్లను రాసి పౌష్టికాహారం దుర్వినియోగం కాకుండా అరికట్టొచ్చు.

ఇంటింటికెళ్లి వివరాల నమోదు..

వికారాబాద్ జిల్లాలోని అంగన్‌వాడీ టీచర్లు ఇంటింటికెళ్లి సర్వే చేస్తున్నారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలోని టీచర్ తన పరిధిలోని ఇండ్ల వద్దకెళ్లి కుటుంబ సభ్యుల వివరాలను తీసుకుని మొబైల్‌లోని యాప్‌లో పొందుపరుస్తున్నారు. ఇంటి యజమానితోసహా కుటుంబంలో ఎంత మంది సభ్యులున్నారు, వారి వయసు, ఆధార్ సంఖ్య, పుట్టిన తేదీ, గర్భిణులు, బాలింతలు, కులం, దివ్యాంగులు, పిల్లల బరువు, ఎత్తు వంటి వివరాలను నమోదు చేస్తున్నారు.

జిల్లాలో ఐదు ప్రాజెక్టులు

వికారాబాద్ జిల్లాలోని పరిగి, తాండూరు, వికారాబాద్, మర్పల్లి, కొడంగల్‌లో ఐసీడీఎస్ ప్రాజెక్టులున్నాయి. వీటి పరిధిలో బాలింతలు- 5359, గర్భిణులు -6121, ఏడు నెలల నుంచి మూడేండ్లలోపు చిన్నారులు- 33157, మూడు నుంచి ఆరేండ్ల లోపు చిన్నారులు- 19,655 మంది ఉన్నారు. వీరందరికీ ప్రభుత్వం ద్వారా ప్రతినెలా పౌష్టికాహారం అందుతున్నది. ఎన్‌హెచ్‌టీఎస్ సర్వేతో లబ్ధిదారుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదై ఉండడంతో పౌష్టికాహారం పంపిణీ పారదర్శకంగా ఉంటుంది.

జిల్లాలో 90 శాతం సర్వే పూర్తి

జిల్లాలో ఎన్‌హెచ్‌టీఎస్ సర్వే 90 శాతం పూర్తైంది. వంద శాతం పూర్తి చేసేలా టీచర్లకు ఆదేశాలు ఇచ్చాం. ఇంటింటికెళ్లి అంగన్‌వాడీ టీచర్లు సర్వే చేస్తున్నారు. ఈ సర్వే తో ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని లబ్ధిదారులకు పంపిణీ చేసే పౌష్టికాహారం పక్కదారి పట్టకుండా ఉంటుంది. లబ్ధిదారుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదై ఉండడం వల్ల సరుకుల పంపిణీ పారదర్శకంగా జరుగుతుంది.

- జ్యోతీపద్మ, జిల్లా సంక్షేమ శాఖ అధికారిణి

చిన్నారి బరువును తూకం వేస్తున్న టీచర్

తమ్మలోనిగూడ గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఉపాధి కూలీలు

ఉపాధి కూలీల ధర్నా

యాచారం, మే28: మండలంలోని తమ్మలోనిగూడ గ్రామంలో ఉపాధి కూలీలు మంగళవారం ఆందోళనకు దిగారు. ప్రతి కూలీకీ పని కల్పించాలని డిమాండ్ చేస్తూ పంచాయతీ కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నా చేపట్టారు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అంజయ్య మాట్లాడుతూ..ఉపాధి హామీ పనులు కొందరికే కల్పిస్తూ మరి కొందరికి కల్పించక పోవడం సరికాదన్నారు. ప్రతి కూలీకీ ప్రభుత్వం పని కల్పించాలన్నారు.

కరువు కాలంలో పనులు లేక కూలీలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. జాబ్‌కార్డున్నా ప్రతి కూలీకీ కచ్చితంగా ఉపాధి హామీ పథకం పనులు కల్పించాలన్నారు. పని చేసిన కూలీలకు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు డబ్బులు చెల్లించాలన్నారు. లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

నందిగామ, మే 28 : ప్రభుత్వ గుర్తింపు పొందిన డీలర్ల వద్దే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలని రంగారెడ్డి జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి గీతారెడ్డి తెలిపారు. నందిగామ మండలం చేగూరు గ్రామంలో మంగళవారం గీతారెడ్డి విత్తనాల కొనుగోలు, నకిలీ విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు విత్తనాలు కొనుగోలు చేసినప్పటి నుంచి పంటలు పండి ధాన్యం చేతికి వచ్చే వరకు విత్తనాల ప్యాకింగ్ కవర్, కొనుగోలు రసీదును భద్రపరచుకోవాలని సూచించారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి గోపాల్‌నాయక్, ఏఈవో రవి పాల్గొన్నారు.



చేగూరులో రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి గీతారెడ్డి